
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి
5
మెదక్
జిల్లాల వార్తలు
గురువారం 31 జూలై 2025



మార్కెట్‌శాఖ అక్రమాలపై విజి 'లెన్స్'

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పటాన్‌చెరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పటాన్‌చెరు మార్కెటింగ్ శాఖలో జరిగిన అక్రమాలపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఈ నెల 26న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'పటాన్‌చెరు మార్కెట్‌లో అవినీతి బాగోతం' కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. రద్దు చేసిన దుకాణాల కేటాయింపులో పెద్దఎత్తున డబ్బులు చేతులు మారిన వ్యవహారంపై విజిలెన్స్ విభాగం అదనపు డైరెక్టర్ రవికుమార్ విచారణ చేయనున్నటు పేర్కొన్నారు.

వ్యాధుల నియంత్రణే కీలకం

డాక్టర్లు, సిబ్బంది బాధ్యతగా పనిచేయాలి

సంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో నాగనిర్మల



డాక్టర్ నాగనిర్మల

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

సంగారెడ్డి అర్బన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులు దరిచేరకుండా నియంత్రణే కీలకమని సంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి వైద్యాధికారిని డాక్టర్ కె.నాగనిర్మల పేర్కొన్నారు. వర్షాలతో వాతావరణం పూర్తిగా మారిందని, ప్రజలంతా పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతను పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆమె 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ పలు విషయాలు వెల్లడించారు.

జిల్లాలో ఇప్పటి వరకు ఎన్ని డెంగ్యూ, టైఫాయిడ్, డయేరియా కేసులు నమోదయ్యాయి?

జిల్లాలో 43 డెంగ్యూ, 81 టైఫాయిడ్, 150 డయేరియా కేసులు నమోదయ్యాయి. డెంగ్యూ కేసులు నమోదైందే ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్ స్పందించి తగు నియంత్రణ చర్యలు తీసుకుంటుంది. జూన్ నుంచి ఇంటింటి జ్వర సర్వే నిర్వహిస్తున్నాం. ఇప్పటి వరకు 3,51,481 మందిని సర్వే చేసి, 7089 మంది జ్వర బాధితులను గుర్తించాం. జిల్లాలో 98 శాతం జ్వర సర్వే పూర్తయింది.

ఆరోగ్య కేంద్రాల్లో మందులు ఉన్నాయా?

జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్ సెంటర్లలో సీజనల్ వ్యాధులు, కుక్క, పాము కాటు మందులు సరిపడా అందుబాటులో ఉన్నాయి.


సీజనల్ వ్యాధుల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారా?

సీజనల్ వ్యాధుల కట్టడిలో దోమల నియంత్రణ, పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత కీలకం. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. శుభ్రమైన ఆహారం తీసుకోవాలి. దీనిపై వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లడం లేదని, డాక్టర్లు, సిబ్బంది సమయపాలన పాటించడం లేదనే ఆరోపణలపై ఏం చర్యలు తీసుకుంటున్నారు?

ఉన్నతాధికారుల పర్యటనలపై నెలవారీ టూర్ ప్లాన్ సిద్ధం చేశాం. క్షేత్రస్థాయిలో పర్యటించి చెక్‌లిస్ట్ ప్రకారం పని పూర్తిచేస్తారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ అమలుతీరును కూడా పరిశీలించాలని వారిని ఆదేశించాం. డాక్టర్లు, వైద్య సిబ్బంది సమయపాలన పాటించేలా కఠిన చర్యలు తీసుకుంటున్నాం.

ఖాకీల బదిలీ'లీలలు'..!



ఏడాదికే ఆరుగురు సీఐల మార్పు

హాట్‌సీట్‌లో పోస్టింగ్ కోసం పైరవీలు

అయినా.. ఎక్కువ కాలం పని చేయలేని పరిస్థితి

అక్రమాలు.. రాజకీయాలకే కారణమా?

పటాన్‌చెరు పోలీసులకు హాట్‌సీట్.. ఇక్కడ పోస్టింగ్ దక్కించుకునేందుకు పైరవీలు చేస్తారు. కానీ, ఇక్కడ పని చేయడం పోలీసులకు కత్తిమీద సామే. అష్టకష్టాలు పడి పోస్టింగ్ దక్కించుకున్నా.. నేతలను ప్రసన్నం చేసుకుని పని చేసినా ఎక్కువ కాలం మాత్రం ఉండటం లేదు. నియోజకవర్గ పరిధిలోని సీఐల బదిలీలే ఇందుకు నిదర్శనం. వచ్చిన కొందరు సీఐలు ఏడాది కంటే ఎక్కువ పని చేయలేదంటే అతిశయోక్తి కాదు. దీనికి వెనుక రాజకీయ ప్రమేయంతోపాటు ఆయా అధికారుల అక్రమాలు కూడా కారణమనే ఆరోపణలు లేకపోలేదు.

పటాన్‌చెరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): బీడీఎల్ సీఐ స్వామి గౌడ్ ఇక్కడ పోస్టింగ్ పొందిన ఏడాది 25 రోజులకే బదిలీ కావడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఇదే తరహాలో నియోజకవర్గంలోని ఇతర ప్రాంతాల్లోనూ జరిగింది. ఇదే సీఐ కంటే ముందు పని చేసిన రవీందర్‌రెడ్డి 11 నెలల 15 రోజులకే బదిలీ అయ్యారు. పటాన్‌చెరు పీఎస్ పరిధిలో సీఐ ప్రవీణ్‌రెడ్డి సైతం తక్కువ కాలమే పని చేశారు. ఆయన బదిలీ వెనుక రాజకీయాలు ఉన్నాయని గుసగుసలు వినిపించాయి. అమీన్‌పూర్ సీఐగా పని చేసిన నాగరాజు సైతం ఆరు నెలలకే బదిలీ అయ్యారు. ఐడీఏ బొల్లారంలో నయీముద్దీన్, జిన్నారంలో సుధీర్ ఆరు నెలలకే బదిలీ అయ్యారు. ఇక గుమ్మడిదలలో ఎస్సై మూడు నెలలకే బదిలీ కావడం చర్చకు దారి తీసింది. ఇవన్నీ ఒక ఎత్తయితే నేరుగా డీఎస్పీ రవీందర్‌రెడ్డి రాజకీయ కారణాలతో 15 నెలలకే బదిలీపై వెళ్లారు.

పని చేయని సిఫార్సులు

నియోజకవర్గం కొద్ది రోజులకే బదిలీపై వెళ్లిన ఒకరిద్దరు అధికారులు తమ బదిలీలను ఆపించేందుకు ఏకంగా మంత్రులను ఆశ్రయించినా ఫలితం లేకుండా పోయినట్లు సమాచారం. జిల్లా మంత్రితో పాటు, పొరుగు జిల్లా మంత్రులు వేర్వేరుగా ఇద్దరు సీఐల విషయంలో కలగజేసుకున్నా.. బదిలీలు మాత్రం ఆగలేదని తెలుస్తోంది. ఈ బదిలీల వెనుక రాజకీయ కారణాలు

మిగతా 8వ పేజీలో

అధికారులకు హాట్‌సీట్

పటాన్‌చెరు నియోజకవర్గం అంటేనే దేశంలోనే ప్రత్యేక స్థానం. ఇక్కడ వేల కోట్ల విలువైన వ్యాపారాలు జరుగుతాయని ప్రచారంలో ఉంది. ఇక ఈ ప్రాంతంలోని ఏ పోలీస్‌స్టేషన్ అయినా.. సర్కిల్ అయినా కొందరు ఖాకీలకు హాట్ సీట్. ఇక్కడ పోస్టింగ్ పడితే కొద్ది కాలంలోనే కావాల్సినంత కూడబెట్టుకోవచ్చునని భావిస్తారు. ఇక్కడ పోస్టింగ్ దక్కించుకునేందుకు కానిస్టేబుల్ స్థాయి నుంచి సర్కిల్ వరకు పోటీ పడుతారు. ఇందుకోసం పైరవీలు చేసుకుంటారు. పైసలూ ఖర్చు చేస్తారు. అయితే, పటాన్‌చెరు పరిధిలో సీఐలుగా పోస్టింగ్ పొందిన ఓ ముగ్గురు వచ్చిన 12 నెలల్లోనే బదిలీపై వెళ్లడం వెనుక కారణాలు ఏమిటనేది కిందిస్థాయి సిబ్బంది విశ్లేషించుకుంటున్నారు.

అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు

- తప్పిన పెను ప్రమాదం
- ప్రయాణికులు సురక్షితం

6



అదుపు తప్పి కాల్వలోకి దూసుకెళ్లిన బస్సు

చేతులు, కాళ్లు కట్టేసి.. నడుముకు బండరాయి కట్టి..

6

- చెరువులో వ్యక్తి మృతదేహం
- కుటుంబ సభ్యుల ఆందోళన



'క్రిటికల్ కేర్' ప్రారంభోత్సవం ఎప్పుడో..?

సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ప్రాంగణంలో 50 పడకల క్రిటికల్ కేర్ విభాగాన్ని టీజీఎంఎస్‌ఐడీసీ ఆధ్వర్యంలో రూ.23.75 కోట్ల వ్యయంతో నిర్మించారు. అధునాతన వైద్య పరికరాలు కూడా ఇప్పటికే చేరుకున్నాయి. కేంద్ర ప్రభుత్వ పెద్దలతో ప్రారంభించాలతో.. వారి అపాయింట్‌మెంట్ కోసం అధికారులు ఎదురుచూస్తున్నారు. అన్ని పనులు పూర్తయిన నేపథ్యంలో త్వరితగతిన ప్రారంభించి అందుబాటులోకి తీసుకువస్తే ప్రమాద బాధితులకు మెరుగైన వైద్యం అందే అవకాశం ఉందని ప్రజలు కోరుతున్నారు.

-సంగారెడ్డి అర్బన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి)



ప్రమోషన్ లిస్టులో 152 మంది టీచర్లు

మెదక్ జిల్లాలో జూలై 30 వరకు ఖాళీలు పరిగణనలోకి

జీహెచ్‌ఎం, పీఎస్‌హెచ్‌ఎం, స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీలకు అవకాశం

మెదక్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల పదోన్నతులకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో మెదక్ జిల్లా విద్యాశాఖ ప్రణాళిక సిద్ధం చేసింది. జూలై 30 వరకూ ఉన్న ఖాళీలను పరిగణనలోకి తీసుకుంది. ఎస్జీటీలు, స్కూల్ అసిస్టెంట్లకు ప్రమోషన్లు లభించనున్నాయి. జిల్లాలో దాదాపు 152 మంది ఉపాధ్యాయులకు జీహెచ్‌ఎం, పీఎస్‌హెచ్‌ఎం, స్కూల్ అసిస్టెంట్ పోస్టులను ప్రమోషన్ల ద్వారా భర్తీ చేసే అవకాశం ఉంది. గత సంవత్సరం జూన్‌లో రాష్ట్ర ప్రభుత్వం మొదటిసారి బదిలీలు, పదోన్నతులకు అవకాశం కల్పించింది. స్కూల్ అసిస్టెంట్లకు గెజిటెడ్ హెచ్‌ఎంలుగా, ఎస్టీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించారు. ఈ సంవత్సరం ఉద్యోగ విరమణతో ఏర్పడిన హెచ్‌ఎం, స్కూల్ అసిస్టెంటు ఖాళీగా మిగిలడంతో మరోసారి అవకాశం కల్పించింది. మెదక్ జిల్లా వ్యాప్తంగా 4,044 ఉపాధ్యాయ పోస్టులు ఉండగా, ప్రస్తుతం 3,521 మంది విధులు నిర్వహిస్తున్నారు. జూలై 30 వరకు 523 ఖాళీలు ఉన్నట్లుగా జిల్లా విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఇందులో 152 మందికి పదోన్నతి లభించవచ్చునని తెలుస్తోంది. జిల్లాలో జీహెచ్‌ఎం (2) 25 పోస్టులు, పీఎస్ హెచ్‌ఎం-31 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇందులో

మిగతా 8వ పేజీలో

జిల్లాలో ఖాళీలు

జీఎంహెచ్ (ప్రభుత్వ) 2 పోస్టులు, లోకల్- 23, పీఎస్‌హెచ్ ఎం (ప్రభుత్వ)-1, లోకల్ - 30, ఎస్‌ఏ మ్యాథ్స్ (ప్రభుత్వ)-3, లోకల్ - 1, ఎస్‌ఏ ఫిజిక్స్ (ప్రభుత్వ) - 2, లోకల్ - 2,ఎస్‌ఏ బయో(ప్రభుత్వ)-5, లోకల్ - 7, ఎస్‌ఏ సోషల్ (ప్రభుత్వ)- 2, లోకల్ - 24, ఎస్‌ఏ తెలుగు (ప్రభుత్వ) - 3, లోకల్ - 17, ఎస్‌ఏ హిందీ (ప్రభుత్వ)- 4, లోకల్ - 14, ఎస్‌ఏ ఇంగ్లిష్ (ప్రభుత్వ) - 2, లోకల్ - 8, ఎస్‌ఏ ఉర్దూ (ప్రభుత్వ) - 2, లోకల్ - 1, ఎస్‌ఏ స్పెషల్ (ప్రభుత్వ) - 1, లోకల్ - 19.. ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు విద్యాశాఖ సిబ్బంది తెలిపారు.

పంద్రాగస్టు నుంచి ప్రీ ప్రైమరీ

ఉమ్మడి జిల్లాలో 106 పాఠశాలల ఎంపిక

7లో



సంగారెడ్డిలోని జిల్లా పోలీసు కార్యాలయంలో సైబర్ విభాగాన్ని పరిశీలిస్తున్న ఐజీ

సంగారెడ్డి జిల్లా పోలీసుల పనితీరు భేష్

డ్రగ్స్ నిర్మూలనలో 'ఎస్ న్యాబ్'తో సత్ఫలితాలు

రాష్ట్ర సరిహద్దుల్లో నిఘా కట్టుదిట్టం

మల్టీ జోన్-2 ఇన్‌చార్జి ఐజీ తఫ్సీర్ ఇక్బాల్

సంగారెడ్డి క్రైం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా పోలీసుల పనితీరు బాగుందని మల్టీ జోన్-2 ఇన్‌చార్జి ఐజీ తఫ్సీర్ ఇక్బాల్ పేర్కొన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలన కోసం ఎస్-న్యాబ్ తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయని అన్నారు. సంగారెడ్డిలోని జిల్లా పోలీసు కార్యాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. పోలీసు పరేడ్‌గ్రౌండ్, మోటార్ వెహికల్ కార్యాలయాన్ని పరిశీలించారు. జిల్లాలో నేరాలు, రోడ్డు ప్రమాదాలు నివారణకు తీసుకుంటున్న చర్యలను ఎస్పీని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ పొరుగు రాష్ట్రాల నుంచి గంజాయి, పొగాకు, గుట్కా వంటివి అక్రమ రవాణా జరగకుండా వాహనాల తనిఖీ పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. స్థానిక ఎన్నికలు సజావుగా జరగడానికి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అదనపు ఎస్పీ సంజీవరావు, డీటీసీ అదనపు ఎస్పీ శ్రీనివాస్‌రావు, డీఎస్పీలు సత్తయ్యగౌడ్, ప్రభాకర్, సైదా నాయక్, వెంకట్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కూలి పని చేస్తున్న బానోత్ రాజు

నాడు సర్పంచ్.. నేడు కూలీ

గ్రామాభివృద్ధి కోసం రూ. 3 లక్షల అప్పు

బిల్లులు రాక కూలి పనికి వెళ్తున్న వైనం

శివ్వంపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఆయన గ్రామానికి ఏకగ్రీవ సర్పంచ్. బీఏ వరకు చదివిన యువకుడు ప్రజలకు సేవ చేయడం కోసం నాలుగు తండాలకు ఐదేళ్ల పాటు సర్పంచ్‌గా పనిచేశారు. నేడు సీన్ రివర్స్ అయ్యింది. ప్రజాప్రతినిధిగా అందరి గౌరవాన్ని అందుకున్న ఆయన.. చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు రాక.. కుటుంబాన్ని పోషించుకునేందుకు వ్యవసాయ కూలీగా మారారు. మెదక్ జిల్లా శివ్వంపేట మండలం మాల్యాతండాతోపాటు బోజ్యా, హరిదాస్, జేగ్యా తండాలను కలిసి గ్రామపంచాయతీగా చేశారు. 2019లో జరిగిన ఎన్నికల్లో మాల్యా తండాకు చెందిన బానోత్ రాజు సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారరు. గ్రామ అభివృద్ధికి తన సొంత నిధులు రూ.3 లక్షలు ఖర్చు చేశారు. వివిధ పనులు చేసిన అతనిని తండావాసులు అభినందించినా.. అప్పటి ప్రభుత్వం బిల్లులు విడుదల చేయలేదు. పదవీ కాలం ముగిసి రెండేళ్లు కావొస్తున్నా కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. చేసిన అప్పులు తీర్చడం కోసం పొలంలో కూలి పనికి వెళ్తున్నారు. బిల్లులు రాక.. అప్పులు తీర్చే మార్గం లేక కూలికి వెళ్తున్నానని ఆయన వాపోయారు.

'అందోలు'లో మీనాక్షి నటరాజన్ పర్యటన

1న పాదయాత్ర, 2న శ్రమదానం, కార్యకర్తలతో ముఖాముఖి

కార్యకర్తలు భారీగా తరలిరావాలి : మంత్రి దామోదర్ రాజనర్సింహ

జోగిపేట, జూలై30(ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ రేపు, ఎల్లుండి అందోలు నియోజకర్గంలో పర్యటిస్తారని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. జోగిపేటలోని కాంగ్రెస్ కార్యాలయంలో బుధవారం ఆయన కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆగస్టు 1న సంగుపేట నుంచి జోగిపేట వరకు పాదయాత్ర చేస్తారని తెలిపారు. ఇక్కడే బసచేసి మరుసటి రోజు అందోలు-జోగిపేట మున్సిపాలిటీలో శ్రమదానం చేస్తారని పేర్కొన్నారు. అనంతరం కార్యకర్తలతో ముఖాముఖి సమావేశమై 18 నెలల ప్రభుత్వ పనితీరుపై అభిప్రాయాలను సేకరిస్తారని తెలిపారు. కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షుడు సంగమేశ్వర్, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ శేరి జగన్మోహన్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ మక్త జగన్మోహన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు నరేందర్‌రెడ్డి, దుర్గారెడ్డి, నాయకులు సురేందర్‌గౌడ్, ప్రవీణ్, చిట్టిబాబు, శంకర్, హన్మాండ్లు, ధనంజయరెడ్డి, రాజశేఖర్, రాజు, శరత్‌బాబు, భాస్కర్, మధు, చోటూ తదితరులు పాల్గొన్నారు.



జోగిపేటలో కార్యకర్తలతో మాట్లాడుతున్న మంత్రి దామోదర్

సంగారెడ్డి కలెక్టర్‌కు సీఎం అభినందన



సంగారెడ్డి క్రైం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్యను తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఎక్స్ వేదికగా అభినందించారు. హత్నూరలోని కెజీబీవీ పాఠశాలను కలెక్టర్ సోమవారం నాడు సందర్శించి సౌకర్యాలను పరిశీలించారు. సిఎస్ఆర్ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. రాత్రి అక్కడే నిద్ర చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్యను సిఎం రేవంత్‌రెడ్డి ఎక్స్ వేదికగా అభినందించారు. విద్యార్థులతో కలిసి మెలిసి ఉంటూ వారి బాగోగులు తెలుసుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు.

ఫేషియల్ రికగ్నేషన్‌తో అక్రమాలకు చెక్

పెన్షన్‌దారులకు ప్రయోజనం : సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య



పెన్షన్‌దారుడి ఫేషియల్ రికగ్నేషన్‌ను యాప్‌లో నమోదు చేయడాన్ని పరిశీలిస్తున్న సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య

సంగారెడ్డి క్రైం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఫేషియల్ రికగ్నేషన్ యాప్ విధానం ద్వారా పెన్షన్ల పంపిణీలో అక్రమాలకు అడ్డుకట్ట వేయవచ్చని సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని పోతిరెడ్డిపల్లి వార్డు కార్యాలయాన్ని బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ గుర్తింపు యాప్ ద్వారా పెన్షన్లు పంపిణీ చేయడంతో వృద్ధులు, వేలి ముద్రలు నమోదు చేయలేని వారికి ప్రయోజనం ఉంటుందన్నారు. గతంలో పెన్షన్‌దారులు మృతిచెందినా నమోదు చేయకుండా సంవత్సరాల తరబడి పెన్షన్ డబ్బులు స్వాహా చేసిన సంఘటనలు ఉన్నాయన్నారు. ఇలాంటికి కొత్త విధానంతో చెక్ పడుతుందని పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా కొత్త విధానంలోనే పెన్షన్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం పోతిరెడ్డిపల్లిలో డీసీఎంఎస్ ఎరువుల దుకాణాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. యూరియా స్టాక్‌ను పరిశీలించి, రోజువారీ వివరాలను ప్రదర్శించాలని ఆదేశించారు. కార్యక్రమాల్లో అదనపు డీఆర్డీవో సూర్యారావు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు .

మెదక్ ఆర్డీవోకు స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి

మెదక్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మెదక్ ఆర్డీవో రమాదేవి స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొందారు. ఇటీవల ప్రభుత్వం సెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లుగా రాష్ట్ర వ్యాప్తంగా 46 మందికి పదోన్నతి కల్పించింది. ఇందులో భాగంగా మెదక్ ఆర్డీవో రమాదేవికి పదోన్నతి లభించింది. ఈ సందర్భంగా బుధవారం ఆమె కలెక్టర్ రాహుల్ రాజ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. కలెక్టర్ మాట్లాడుతూ పదోన్నతి బాధ్యతలను మరింత పెట్టింపు చేస్తుందని పేర్కొన్నారు. రెవెన్యూ సేవల పరంగా, ప్రజలకు అభివృది, సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడంలో రమాదేవి సేవలు అభినందనీయమన్నారు. అంతకుముందు వివిధ శాఖల జిల్లా అధికారులు, కార్యాలయ సిబ్బంది రమాదేవికి శుభాకాంక్షలు తెలిపారు.



కలెక్టర్‌కు బోకే అందిస్తున్న ఆర్డీవో రమాదేవి

అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు

- తప్పిన పెను ప్రమాదం
- ప్రయాణికులు సురక్షితం

మునిపల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం పెద్దలోడి గ్రామ శివారులో బుధవారం ఓ ఆర్టీసీ బస్సు అదుపు తప్పి కాల్వలోకి దూసుకెళ్లింది. ఆ సమయంలో బస్సులో సుమారు 60 మంది ప్రయాణికులు ఉండగా, బస్సు సగం రోడ్డుమీదే ఆగిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. రోజు మాదిరిగానే సంగారెడ్డి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు సదాశివపేట నుంచి మక్తక్యాసారం గ్రామానికి బుధవారం ఉదయం వెళ్లి, తిరిగి వస్తోంది. బస్సు పెద్దలోడి గ్రామ శివారుకు రాగా, ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించేందుకు ఆర్టీసీ డ్రైవర్ ప్రయత్నించారు. ఇదే క్రమంలో రోడ్డుపై గుంతలు ఉండటంతో బస్సు అదుపు తప్పి రోడ్డు కిందికి దిగి పోయింది. బస్సును అదుపు చేసేందుకు డ్రైవర్ ఎస్‌కే మహ్మద్ ప్రయత్నిస్తున్న క్రమంలో స్టీరింగ్‌కు ఉండే స్ప్రింగ్ విరిగిపోయింది. దీంతో డ్రైవర్ చేతికి స్వల్పగాయమైంది. బస్సు ప్రమాదానికి గురైన వెంటనే ప్రయాణికులు అందులోంచి దిగిపోయారు. సమాచారం అందుకున్న సంగారెడ్డి డిపో మేనేజర్ ఉపేందర్ వచ్చి వివరాలు సేకరించారు. రోడ్డు సరిగ్గా లేకపోవడం వల్లే ప్రమాదం జరిగిందని డీఎం తెలిపారు. ఆ రూట్‌లో ఒకటే బస్సు ఉండటం.. అది అదుపు తప్పి కాలువలోకి దూసుకువెళ్లడంతో ఆ బస్సు దిగిన ప్రయాణికులు మరో ప్రత్యామ్నాయం లేక ఆటోలు.. ద్విచక్ర వాహనాలపై తగ గమ్య స్థానాలకు వెళ్లిపోయారు.


అదుపు తప్పి కాల్వలో దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

ఈ రోడెట్ల ఉందిర బావో..

ఏడాదైనా మారని తీరు

మక్తక్యాసారం గ్రామానికి వెళ్లే రోడ్డు పూర్తి గుంతలమయంగా ఉండటంతో గతేడాది ఆగస్టు 23న ఓ ఆర్టీసీ డ్రైవర్ డ్రైవింగ్ చేస్తూనే 'ఈ రోడెట్ల ఉందిర బావో.. మక్తక్యాసారం రోడ్డెప్పుడు మారుతుందిరో మావో' అంటూ పాటందుకున్నాడు. ఓ ప్రయాణికుడు దీనిని వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా.. వైరల్ అయింది. ఈ కథనం ఆంధ్రజ్యోతిలోనూ ప్రచురితమైంది. అయినా, ఇప్పటి వరకు అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ రోడ్డును పట్టించుకోవడం లేదు. ఈ నేపథ్యంలోనే బుధవారం 60 మంది ప్రయాణికులతో వెళ్తున్న బస్సు ప్రమాదానికి గురైంది. బస్సు కాల్వలోకి దూసుకెళ్లి ఆగింది. అదే జరగరానికి జరిగితే పెను ప్రమాదం జరిగేదని చెబుతున్నారు. ఇప్పటికైనా మక్తక్యాసారం రోడ్డును బాగు చేయాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.

చేతులు, కాళ్లు కట్టేసి.. నడుముకు బండరాయి కట్టి..

- చెరువులో వ్యక్తి మృతదేహం లభ్యం


ములుగు పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

మద్దూరు/ములుగు, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : మద్దూరు మండలం గాగిల్లాపూర్ గ్రామ శివారులోని చెరువులో బుధవారం సాయంత్రం వ్యక్తి మృతదేహం లభించింది. మృతుడు ములుగు మండల కేంద్రానికి చెందిన తిగుల్ల నెహ్రూ (37)గా పోలీసులు గుర్తించారు. ములుగు ఐకేపీ సెంటర్‌లో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న అతడు సోమవారం పనికని వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అదృశ్యం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. అంతలోనే మద్దూరు మండలం గాగిల్లాపూర్ గ్రామ చెరువులో నెహ్రూ శవమై కనిపించాడు. తాళ్లతో కాళ్లు, చేతులు చుట్టేయడంతో పాటు నడుముకు బండరాయి ఉండి, ఒళ్లంతా కుళ్లిపోయి ఉండటంతో హత్య చేసి ఉంటారన్న అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. చెరువు ఒడ్డుకు మృతదేహం కొట్టుకురావడాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో చేర్యాల సీఐ ఎల్. శ్రీను, మద్దూరు ఎస్ఐ షేక్ మహబూబ్ అలీ సిబ్బందితో కలిసి ఘటనాస్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. 3 రోజుల క్రితం తన స్నేహితులతో కలిసి కారులో గాగిల్లాపూర్ వైపు వచ్చిన నెహ్రూ చెరువులో విగతజీవిగా మారడం పట్ల తోటి మిత్రుల మధ్య తలెత్తిన విభేదాలే కారణమని చెబుతున్నారు.

కుటుంబ సభ్యులు, గ్రామస్థుల ఆందోళన

నెహ్రూను హత్య చేసిన నిందితులను తమకు అప్పగించాలని డిమాండ్ చేస్తూ కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ములుగు పోలీస్‌స్టేషన్ ఎదుట బుధవారం ఆందోళన నిర్వహించారు. విషయం తెలుసుకున్న గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి అక్కడికి చేరుకొని వారికి నచ్చజెప్పారు. నిందితుడిని పట్టుకొని శిక్షపడేలా చూస్తామని, సంయమనం ఉండాలని కోరడంతో ఆందోళనకారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

108 వాహనంలో మహిళ ప్రసవం

చిన్నశంకరంపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): చిన్నశంకరంపేట మండలం చందాపూర్ గ్రామానికి చెందిన విజయ అనే మహిళకు బుధవారం రాత్రి పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్సు వాహనానికి సమాచారం ఇచ్చారు. వెంటనే ఈఎంటీ నవీన్ యాదవ్, పైలెట్ ఆఫీసర్ హరీష్ గర్భిణీని అంబులెన్సులో మెదక్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మార్గమధ్యలో కోంటూర్ గ్రామ శివారులోకి రాగానే పురిటి నొప్పులు ఎక్కువై 108 వాహనంలోనే మగ శిశువుకు జన్మనిచ్చింది. తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నారని, మెరుగైన చికిత్స కోసం మాత శిశు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు వారు తెలిపారు. నవీన్ యాదవ్, హరీష్‌ను జిల్లా అధికారులు జానుషోహిద్, కిరన్ అభినందించారు.


అంబులెన్సు వాహనంలో పండంటి బిడ్డకు జన్మనిచ్చిన తల్లి

ఖేడ్ కార్మిక శాఖ అధికారిపై విచారణ

నారాయణఖేడ్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : నారాయణఖేడ్ కార్మిక శాఖ అధికారి గిరిరాజ్ ప్రతి పనికి ముడుపులు వసూలు చేస్తున్నారని గత నెల 18న పలువురు కార్యాలయం ముందు ఆందోళన చేశారు. ఈ విషయం పత్రికలలో రావడంతో కార్మిక శాఖ అధికారి గిరిరాజ్‌ను ఉన్నతాధికారులు సెలవుపై పంపించారు. ఈ మేరకు డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌రావు బుధవారం నారాయణఖేడ్ కార్యాలయంలో ఆయనపై విచారణ జరిపారు. పలువురు లబ్ధిదారులు తమ నుంచి వివిధ పనుల కోసం ముడుపులు తీసుకున్నట్లు ఫిర్యాదు చేయడమే కాకుండా, పనులు చేయకుండా కార్యాలయం చుట్టూ తిప్పుకున్నాడని ఆధారాలు కూడా చూపించారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని ఆయన తెలిపారు.


విచారణ జరుపుతున్న డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌రావు

రెండు బైకులు ఢీ.. ఇద్దరికి గాయాలు

- ఒకరి పరిస్థితి విషమం

పాపన్నపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని నార్సింగి శివారులో బుధవారం సాయంత్రం రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులకు గాయాలు కాగా, అందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. పాపన్నపేట పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మల్లంపేటకు చెందిన వుట్టి నాగరాజు నార్సింగిలో చేపలు అమ్ముకొని బైక్‌పై పాపన్నపేట వస్తున్నాడు. శంకరంపేట మండలం దానంపల్లికి చెందిన నర్ర సాయిబాబ మెదక్ నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో నార్సింగి శివారులో దారిదేవుని ఆలయ సమీపంలో రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో మల్లంపేటకు చెందిన వుట్టి నాగరాజు తలకు గాయాలు కాగా అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. సాయిబాబా కాలు విరిగింది. వీరిని 108 వాహనంలో మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.



గాయ పడ్డ సాయిబాబా, నాగరాజు

సాయిబాబా ఆలయంలో చోరీ

- హుండీ ధ్వంసం, నగదు అపహరణ

నర్సాపూర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్ పట్టణంలోని ఎన్‌జీవో కాలనీలో ఉన్న సాయిబాబా ఆలయంలో దొంగలు హుండీని ధ్వంసం చేసి అందులోని నగదును అపహరించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్ బుధవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం సాయంత్రం పూజారి ఆలయానికి తాళం వేసి వెళ్లగా, బుధవారం ఉదయం తాళం పగులగొట్టి ఉండటాన్ని గుర్తించారు. దొంగలు ఆలయంలోకి దూరి హుండీని ధ్వంసం చేయడంతో పాటు కొన్ని ఇతర వస్తువులను అపహరించారు. సీసీ కెమెరాలకు సంబంధించిన వైర్లు కూడా కట్ చేశారు. హుండీలో సుమారు రూ.40వేల నగదు ఉండవచ్చని ఆలయ కమిటీ అధ్యక్షుడు తెలిపారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.


దుండగులు ధ్వంసం చేసిన హుండీ

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

సిద్దిపేట రూరల్,జూలై 30(ఆంధ్రజ్యోతి) : అప్పుల బాధతో వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన సిద్దిపేట రూరల్ మండలం చింతమడక గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు, రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గుండేల్లి అంజయ్య (44) గత సంవత్సరం అప్పులు చేసి బిడ్డ పెళ్లి చేశాడు. అప్పటినుంచి ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నాడు. చేసిన అప్పుల గురించి తనలోతాను బాధపడేవాడు. తన భార్య అమ్మగారింటి దగ్గర నుంచి తీసుకువస్తాను అని ధైర్యం చెప్పి తల్లిగారింటికి వెళ్లింది. అప్పులు ఏలా తీర్చాలని మనస్తాపానికి గురై వ్యవసాయ పొలం వద్ద చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య గుండేల్లి కనకవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


అంజయ్య(ఫైల్)

గంజాయి అక్రమ రవాణా కేసులో జైలు శిక్ష, జరిమానా

జహీరాబాద్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : గంజాయి అక్రమ రవాణాకు పాల్పడిన కేసులో ముంబయికి చెందిన సత్రాజ్‌హాస్సేన్‌కు సంగారెడ్డి జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి బుధవారం జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారని ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం ముంబయికి చెందిన సత్రాజ్ హాస్సేన్ 2020 సంవత్సరంలో 16 కిలోల గంజాయిని ముంబాయి నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్న క్రమంలో అప్పట్లో ఎక్సైజ్ పోలీసులు కోహీర్ మండలంలోని కవెలి చౌరస్తా వద్ద వాహనాల తనిఖీలు చేస్తున్న క్రమంలో పట్టుబడ్డాడన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు సంగారెడ్డి జిల్లా కోర్టులో విచారణ కొనసాగిందన్నారు. గంజాయి తరలిస్తున్న విషయం వాస్తవమేనని తేలడంతో సంగారెడ్డి జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి జయంతి నిందితుడికి 5 సంవత్సరాల జైలు శిక్ష, రూ.25 వేల జరిమానా విధించినట్లు ఆయన వివరించారు.

ఏడుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

దుబ్బాక, జూలై30(ఆంధ్రజ్యోతి): దుబ్బాక మండలం ఆకారం గ్రామశివారులో బుధవారం పేకాటస్థావరంపై దాడిచేసి ఏడుగురిని అరెస్టు చేసినట్లు దుబ్బాక ఎస్ఐ కీర్తిరాజు తెలిపారు. వారి నుంచి నాలుగు ద్విచక్రవాహనాలు, రూ.36,286లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ కీర్తిరాజు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ ప్రీప్రైమరీ స్కూళ్లు

పంద్రాగస్టు నుంచి ప్రారంభానికి ఆదేశాలు జారీ

- ఉమ్మడి జిల్లాలో 106 ప్రభుత్వ పాఠశాలలు ఎంపిక
- బడ్జెట్ విడుదల, ఆయా, బోధకుల నియామకం



తూప్రాన్‌లో ప్రీప్రైమరీ తరగతులకు ఎంపికైన పాఠశాల

తూప్రాన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలని ప్రభుత్వం కృషి చేస్తోంది. అందులో భాగంగా ఇప్పటికే ఆంగ్ల మాధ్యమ బోధనను అందిస్తుండగా, ఇప్పుడు, ప్రైవేటు పాఠశాలల మాదిరిగా ప్రీప్రైమరీ విద్యను ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతులు నిర్వహించాలని స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ నవీన్ నికోలస్ ఈ నెల 26న ఆదేశాలు జారీ చేశారు.

ఉమ్మడి జిల్లాలో 106..

రాష్ట్రవ్యాప్తంగా మొదటి విడతలో 1000 ప్రభుత్వ పాఠశాలల్లో దీన్ని అమలు చేయనున్నారు. 210 ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీప్రైమరీ విభాగాల ప్రారంభానికి అనుమతులు మంజూరు చేయగా, మరో 790 ప్రభుత్వ పాఠశాలలను గుర్తించి ప్రారంభించేందుకు అనుమతులు ఇచ్చారు. ఆగస్టు 15 నుంచి తరగతులు ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా 106 ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతులు ప్రారంభం కానున్నాయి. మెదక్ జిల్లాలో 27, సంగారెడ్డి జిల్లాలో 59, సిద్దిపేట జిల్లాలో 20 ప్రభుత్వ పాఠశాలలతో ప్రీప్రైమరీ విభాగాలు ఏర్పాటు కానున్నాయి.

నిధులు మంజూరు..

స్కూల్ ఎడ్యుకేషన్, సమగ్ర శిక్షా, ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ విభాగాలు పరిశీలన అనంతరం ప్రీప్రైమరీ బోధనల అమలుకు అనుమతించాయి. ఇందుకోసం రూ. 3307.23 లక్షల బడ్జెట్‌కు అనుమతి లభించగా, రూ.2262.83 లక్షలు మంజూరు చేస్తూ ప్రభుత్వ కార్యదర్శి డాక్టర్ యోగితారాణా ఆదేశాలు జారీ చేశారు. ప్రీప్రైమరీ పాఠశాల నిర్వహణకు బోధకుడు (ఇన్‌స్ట్రక్టర్), ఆయాను నియమించాలని సూచించారు. ఆయా పోస్టుకు 7వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, బోధకుడి పోస్టుకు ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై ఉండాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. 10 నెలల పాటు గౌరవ వేతనం చెల్లించనుండగా, ఆయాకు రూ.6 వేలు, బోధకుడికి రూ. 8వేలు చెల్లించనున్నారు. నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతులు నిర్వహించనున్నారు. మహిళా అభివృద్ధి అండ్ శిశు సంక్షేమ శాఖ, ఆరోగ్య, వైద్య అండ్ కుటుంబ సంక్షేమ శాఖల సమన్వయంతో వీటిని నిర్వహించనున్నారు. విద్యార్థులు ప్రీప్రైమరీలో చేరగానే యూడైస్ పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశాల్లో పేర్కొన్నారు.

సకల సౌకర్యాలతో..

ప్రీప్రైమరీ విభాగానికి ప్రత్యేక తరగతి గదిని కేటాయించాలని, అనుకూలమైన ఫర్నిచర్, తగినంత ప్రదర్శన, నిల్వ స్థలాలు ఉండాలని, సరైన వెంటిలేషన్ (వెలుతురు), సహజ లైటింగ్ అమర్చబడి ఉండాలని సూచించారు. భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా తరగతి గది ఆకర్షణీయంగా ఉండాలని, విద్యాపరంగా అలంకరించాలని సూచించారు. అనుకూలమైన పారిశుధ్య సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. విద్యార్థుల వయసుకు తగ్గట్టుగా అభివృద్ధి స్థాయికి ఇండోర్, అవుట్‌డోర్ ఆట వస్తువులు పాఠశాలలో అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. ప్రీప్రైమరీ విద్యార్థులు నిద్రపోయే స్థలం అందుబాటులో ఉండాలని వివరించారు. పారిశుధ్య నిర్వహణ గ్రామ పంచాయతీ సమన్వయంతో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలపై ఉంటుందని వివరించారు.

ప్రీప్రైమరీకి ఎంపికైన పాఠశాలలు

మెదక్ జిల్లా :

వెంకటాపూర్ (కే), ఎస్ కొండాపూర్, చిట్యాల, ఆర్కెల, తొగుట, హవేళిఘనపూర్ (ఎల్‌టీ), మానేపల్లి, తిప్పనగుల్ల, శాలిపేట, బూర్గుపల్లి, ఫరీద్‌పూర్, కూసంగి, శివాయపల్లి, పీర్యాతండా, దేశ్యా తండా, కాట్రియల్, ముత్రాజ్‌పల్లి, గుండ్రెడ్డిపల్లి, నందగోకుల్, రజాక్‌పల్లి, కొడిపల్లి, మల్లెపల్లి, ప్యాటగడ్డ, ఆరేపల్లి, తూప్రాన్, నర్సాపూర్, రామాయంపేట ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు.

సంగారెడ్డి జిల్లా :

సంజీవన్‌రావుపేట, డెగుల్‌వాడీ, బిడెకన్న, ఎస్ఎన్ కాలనీ, మేడికుంద, చిన్నహైదరాబాద్, చింతలచెర్వు, జిన్నారం, క్యాసారం, కంకోల్ (యూఎం), పస్తాపూర్ (టీఎం), బుదేర కాలనీ (టీఎం), మునిదేవునిపల్లి, సాదుల్లానగర్, బాచెపల్లి, చల్లగిద్ద టీ, గాంధీనగర్, మంబాపూర్, మిర్జాపూర్ (ఎన్), ఇస్మాయిల్‌ఖాన్‌పేట్, సాదు తండా (జంగి బుర్గ్ కలాన్), ధర్మాపూర్, మద్రి, మాచిరెడ్డిపల్లి, చందాపూర్, కల్హేర్ హెచ్‌డబ్ల్యు, రుద్రారం, వావిలాల, లోనికుర్దు, వెల్టూర్, శంకాపూర్, అంగడిపేట, తాడ్దాన్‌పల్లి, ఆనంతసాగర్, చాప్టాకిటీ, మల్కారేగడి టీ, బ్యాతోల్, కొత్తగూడెం, అలిఖాన్‌పల్లి, బోరేగాన్, కొత్తపల్లి ఎన్, ఉట్‌పల్లి, బడంపేట్, ఇంద్రానగర్, ఇసోజిపేట, మగ్దుంపూర్, చింగెపల్లి, సీతారాంకుంట, బీరంగూడ, ఇస్నాపూర్, చిట్కుల్ వడ్డెరకాలనీ, బొల్లారం (అర్బన్), సంగారెడ్డి (బాలికల), పటాన్‌చెరు (టీఎన్), తెల్లాపూర్, రాంచంద్రాపురం, పటాన్‌చెరు (బాలికలు), అమీన్‌పూర్, పల్వట్ల పాఠశాలలు.

సిద్దిపేట జిల్లా :

సంగుపల్లి, దొమ్మాట, రాంసాగర్, జబ్బాపూర్, మాదారం, పోతారం జే, వీరారెడ్డిపల్లి, లింగారెడ్డిపల్లి, కోనాయపల్లి, దాసర్లపల్లి, గణేష్‌పల్లి, పోరెడ్డిపల్లి, ఉమ్మాపూర్, తీగుల్ నర్సాపూర్, కోనాపూర్, మాటిండ్ల, బాషగూడెం, తాణేదార్‌పల్లి, పల్లెపహాడ్, ఏటిగడ్డ కిష్టాపూర్ బడులు.

పాఠశాల ఎంపిక సంతోషం..



ప్రీప్రైమరీ తరగతుల బోధనకు తూప్రాన్ ప్రాథమిక పాఠశాల ఎంపిక కావడం సంతోషకరం. ప్రభుత్వ పాఠశాలల్లోనూ నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ విద్య ప్రైవేటు పాఠశాలలకు దీటుగా అమలు కానున్నది.

- పట్లూరి లక్ష్మణ్, హెచ్‌ఎం తూప్రాన్



ఢిల్లీలో రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్నకు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ రఘునందన్ రావు, నాయకులు

శంకర్‌పల్లిలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగేలా చూడండి

- రైల్వేశాఖ సహాయ మంత్రికి ఎంపీ వినతి

కంది/అమీన్‌పూర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాకు అతి చేరువలో ఉన్న శంకర్‌పల్లి రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లన్నీ ఆగేలా చూడాలని బుధవారం ఢిల్లీలో రైల్వే శాఖ కేంద్ర సహాయ మంత్రి సోమన్నకు ఎంపీ రఘునందన్‌రావు వినతిపత్రం అందజేశారు. బుధవారం ఉదయం ఢిల్లీలోని రైల్వే శాఖ సహాయ మంత్రి కార్యాలయంలో ఆ శాఖ సహాయ మంత్రి సోమన్నను రఘునందన్‌రావు, బీజేపీ నాయకులు నల్ల నర్సింహారెడ్డి, ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఉద్యోగులు బాలనర్సయ్య, రవి, ఈశ్వరయ్య, ప్రభు, శివకుమార్, కంది శ్రీనివాస్, ప్రదీప్ కుమార్‌లతో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన సంగారెడ్డి జిల్లా వాసులకు, ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఉద్యోగులకు ప్రయాణం సులభతరం చేయడానికి వీలుగా శంకర్‌పల్లిలో ప్రతి ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. శంకర్‌పల్లిలో మచిలీపట్నం బీదర్ ఎక్స్‌ప్రెస్, హుస్సేన్ సాగర్, రాయచూర్, హుబ్లీ, ముంబై, విశాఖపట్నం, విజయపూర్ల ఎక్స్‌ప్రెస్‌లు ఆగడం లేదని, వాటిని ఇక్కడ ఆపేలా చూడాలని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్న ఈ విషయాన్ని రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో చర్చించి త్వరలోనే ఒక నిర్ణయానికి వస్తామని తెలిపారు.

'ఆపరేషన్ సిందూర్' వ్యతిరేక కథనాలపై ఫిర్యాదు

పటాన్‌చెరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : ఆపరేషన్ సిందూర్‌పై తెలుగు పత్రికల్లో వచ్చిన వ్యతిరేక కథనాలపై ఎంపీ రఘునందన్‌రావు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బుధవారం ఢిల్లీలోని పార్లమెంటు భవనంలో వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్ నిర్వహించిన భారత సైన్యానికి వ్యతిరేకంగా తెలుగు పత్రికలు రాయడం దారుణమన్నారు.

రేషన్‌కార్డులు ప్రజల చిరకాల కోరిక

- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్



చిత్రియాల గ్రామంలో లబ్ధిదారులకు రేషన్ కార్డులు అందిస్తున్న కలెక్టర్

పాపన్నపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురు చూసిన ప్రజల చిరకాల కోరిక నెరవేరిందని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. మండలంలోని గాజుల గూడెం, చిత్రాల గ్రామాల్లో ఆర్డీవో రమాదేవి, తహసీల్దార్ సతీష్‌కుమార్‌లతో కలిసి బుధవారం లబ్ధిదారులకు రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా మొత్తం 9964 కొత్త రేషన్ కార్డులను మంజూరు చేశామని అన్నారు. ఇందులో 34,730 మంది సభ్యుల పేర్లు నమోదు చేసి, మొత్తం జిల్లాలో 44,694 మందికి కొత్త రేషన్ కార్డుల ద్వారా లబ్ధి చేకూర్చామని వివరించారు. పాపన్నపేట మండలం కొత్తగా 479 రేషన్ కార్డులను మంజూరు చేశామని వివరించారు.

హవేలిఘనపూర్‌లో..

హవేలిఘనపూర్/మెదక్ అర్బన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ రేషన్ కార్డులు అందిస్తున్నట్లు మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని కూచన్‌పల్లిలో నూతన రేషన్ కార్డులు పంపిణీ, ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం, పశు వైద్యశాలను పరిశీలించారు. మండలంలో కొత్తగా 650 రేషన్ కార్డులు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో మెదక్ ఆర్డీవో రమాదేవి, తహసీల్దార్ సింధు రేణుక ఉన్నారు. అలాగే బుధవారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి యాంటీ డ్రగ్ కమిటీ సమన్వయ సమావేశంలో ఎస్పీ డీవీ శ్రీనివాసరావుతోటు వివిధ జిల్లా అధికారులతో ఆయన సమీక్షించారు. మెదక్ జిల్లాను మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ పిలుపునిచ్చారు.

'ఆంధ్రజ్యోతి' క్లిప్పింగ్‌లు చూపుతూ అవగాహన



విద్యార్థులకు పేపర్ క్లిప్పింగులు చూపుతూ అవగాహన చేస్తున్న టీచర్

రామాయంపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రజ్యోతి మెయిన్‌లో బుధవారం ప్రచురితమైన 'మాసాయిపేట రైలు దుర్ఘటనపై.. నాలుగో తరగతిలో పాఠ్యాంశం' కథనం క్లిప్పింగులను చూపిస్తూ విద్యార్థులకు అవగాహన కల్పించారు. మెదక్ జిల్లా రామాయంపేటలోని ఓ ప్రైవేట్ స్కూల్లో నాలుగో తరగతి విద్యార్థులకు ఆపద సమయాల్లో ధైర్య సాహసాలపై పలు సూచనలు చేశారు ఉపాధ్యాయులు. 11 ఏళ్ల క్రితం మాసాయిపేట వద్ద రైల్వే ట్రాక్‌పై జరిగిన ఈ ఘటనలో తోటి వారి ప్రాణాలు కాపాడిన సాహస బాలిక రుచిత సాహసాన్ని చెప్పారు. దుర్ఘటనలు జరిగినప్పుడు తమను రక్షించుకునే ప్రయత్నాల్లో మీరూ తెలివి ప్రదర్శించాలని చెప్పారు. ఆ ఒక్క క్షణం సాహసం మనతో పాటు కొన్ని ప్రాణాలు, ఆస్తులు కాపాడ వచ్చంటూ విద్యార్థులకు సూచించారు. ఆరోజు స్కూల్ బస్సులో తోటి స్టూడెంట్స్‌తో ప్రయాణిస్తున్న రుచిత భయపడకుండా రైలు ప్రమాద బారి నుంచి ఇద్దరిని కాపాడి ఆమె కూడా కిటికీలోంచి దూకేసిందన్నారు.

మూడు గంటలకే మూత పడిన ప్రభుత్వ బడి

- డెగుల్‌వాడిలో తల్లిదండ్రుల ఆందోళన



మూడు గంటలకే మూసి ఉన్న ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల

కంగ్టి, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని దెగుల్‌వాడి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల బుధవారం మధ్యాహ్నం 3 గంటలకే మూతపడటంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కొనసాగాల్సిన పాఠశాల ముందుగానే మూసివేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గత కొంతకాలంగా పాఠశాల హెచ్‌ఎం రేఖారాణి పనితీరుపై గ్రామస్థులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా మార్పు లేదని తెలిపారు. బుధవారం మధ్యాహ్నం 2.30 గంటలకే ప్రధానోపాధ్యాయురాలు రేఖారాణి పాఠశాల నుంచి వెళ్లిపోవడంతో, మిగతా ఉపాధ్యాయులూ వెళ్లిపోయారు. పిల్లలంతా మూడు గంటలకే ఇళ్లకు రావడంతో విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకొని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనియెడల ఆందోళన తీవ్రం చేస్తామని హెచ్చరించారు. ఈ విషయమై ఎంఈవో రహీమొద్దీన్‌ను వివరణ కోరగా, దెగుల్‌వాడి పాఠశాల మధ్యాహ్నం 3 గంటలకే మూతపడినట్లు తన దృష్టికి వచ్చిందని, విచారణ చేపట్టి నివేదిక ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు.

ప్రపంచ న్యూరో కాంగ్రెస్‌కు డా.కృష్ణమూర్తికి ఆహ్వానం



డా.కృష్ణమూర్తి

సంగారెడ్డి అర్బన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి చౌరస్తాలోని హోప్ న్యూరో అండ్ కార్డియాక్ హాస్పిటల్ చైర్మన్ డా.టి. కృష్ణమూర్తికి దుబాయ్‌లో డిసెంబర్ 1 నుంచి 5 వరకు జరగనున్న 19వ ప్రపంచ న్యూరో సమావేశాలకు ఆహ్వానం అందింది. వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ న్యూరాలజికల్ సొసైటీస్ ఆధ్వర్యంలో జరిగే ఈ ప్రతిష్ఠాత్మక ప్రపంచ న్యూరో కాంగ్రెస్‌కు ప్రముఖ న్యూరో సర్జన్ ఎంపిక కావడం విశేషం. ఈ సందర్భంగా డా. కృష్ణమూర్తి మాట్లాడుతూ ప్రపంచ సమావేశాలలో తన పరిశోధన పత్రాన్ని సమర్పించనున్నట్లు తెలిపారు. ప్రపంచ నలుమూలల నుంచి న్యూరో వైద్యులు పాల్గొనే ఈ సమావేశాలలో అత్యాధునిక వైద్య సేవలు, నూతన పరిశోధనలు, వాటి ఫలితాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని వైద్య రంగానికి జోడించడం వంటి అంశాలపై చర్చిస్తారన్నారు. పట్టణ స్థాయి నుంచి ప్రపంచ వేదికలపై ప్రసంగించడం అభినందనీయమని హోప్ హాస్పిటల్ సిబ్బంది, శ్రేయోభిలాషులు కొనియాడారు.

ఢిల్లీకి చేరిన 'ఆంధ్రజ్యోతి' కథనం

- కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లిన ఏఎంసీ మాజీ చైర్మన్
- జోగిపేట పోస్టాఫీస్‌కు నిధులిస్తామని హామీ
- అప్పటికప్పుడే అధికారులకు ఆదేశాలు



కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌కు 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనాన్ని చూపిస్తున్న గంగా జోగినాథ్ దంపతులు

జోగిపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): శిథిలావస్థకు చేరిన జోగిపేట పోస్టాఫీసు దుస్థితిపై ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన కథనం ఢిల్లీకి చేరింది. బుధవారం ఆంధ్రజ్యోతిలో 'తపాలా.. నిర్లక్ష్యమేలా' శీర్షికతో బుధవారం కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ కథనాన్ని ప్రస్తుతం ఢిల్లీలోనే ఉన్న జోగిపేట ఏఎంసీ మాజీ చైర్మన్, జోగిపేట రైల్వే సాధన సమితి కన్వీనర్ గంగా జోగినాథ్ గుప్తా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సిఫారసు, ఏపీ టీడీపీ సీనియర్ నాయకుడు వెలగపూడి గోపాల క్రిష్ణ ప్రసాద్ సహకారంతో కేంద్ర పోస్టల్, టెలీకమ్యూనికేషన్ల శాఖ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌ను గంగా జోగినాత్ గుప్తా తన సతీమణితోపాటు కలిశారు. ఈ సందర్భంగా జోగిపేట పోస్టల్ భవనం చరిత్ర, అందిస్తోన్న సేవలు, వివరించి, ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనాన్ని చూపించారు. నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. దీంతో స్పందించిన కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ జోగిపేట పోస్టల్ భవన నిర్మాణానికి హామీ నివ్వడంతో పాటు, నిధుల విడుదల కోసం సంబంధిత అధికారులను అప్పటికప్పుడే ఆదేశించారని గంగా జోగినాథ్ తెలిపారు.

ఖేడ్‌లో కాశీ జగద్గురుకు ఘన స్వాగతం



జగద్గురు చంద్రశేఖర స్వామికి పాదపూజ చేస్తున్న భక్తులు

నారాయణఖేడ్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : ధర్మ మార్గమే ప్రతి ఒక్కరికి మోక్ష మార్గమని కాశీ జగద్గురు చంద్రశేఖర శివాచార్య మహాస్వామి అన్నారు. బుధవారం మొట్టమొదటిసారిగా కాశీ జగద్గురు సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌కు రావడంతో ఆయనకు స్థానిక జంగమ లింగాయత్ సమాజ్ బాధ్యులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కట్టమైసమ్మ ఆలయం నుంచి బసవ మంటపం వరకు ప్రత్యేక రథంలో స్వామి వారిని కూర్చోబెట్టి శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం బసవ మంటపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎక్కడైతే ధర్మం ఉంటుందో ఆ ప్రాంతం సుఖశాంతులతో సుభిక్షంగా ఉంటుందన్నారు. అందువల్ల ప్రతి ఒక్కరూ ధర్మ మార్గంలో నడుచుకోవడమే కాకుండా భక్తి మార్గాన్ని కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో భర్దీపూర్ ఆశ్రమ పీఠాధిపతి డాక్టర్ సిద్ధేశ్వర్ స్వామి, పంచగామ పీఠాధిపతి కాశీనాథ్ బాబా, ధనశ్రీ పీఠాధిపతి వీరేశ్వర్ స్వామి, బార్సి పీఠాధిపతి మణికంఠ శివాచార్యతో పాటు జంగమ, లింగాయత్ సమాజ్ బాధ్యులు పాల్గొన్నారు. స్వామీజీకి స్వాగతం చెప్పిన వారిలో మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, టీపీసీసీ సభ్యులు శంకరయ్య స్వామి, సిద్ధయ్య స్వామి, విజయ్‌కుమార్ స్వామి, నరేష్ స్వామి, శంకరప్ప, రేవణయ్య స్వామి, రమేష్, జగదీశ, మన్మథ కిశోర్, ఆనంద్, బస్వరాజ్, వీరశెట్టి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గృహంలో జగద్గురుకు పాదపూజ

కాశీ జగద్గురు చంద్రశేఖర శివాచార్య బుధవారం సాయంత్రం స్థానిక ఎమ్మెల్యే సంజీవరెడ్డి స్వగృహానికి వచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సతీమణి అనుపమ్మరెడ్డి, మాతృమూర్తి గాలెమ్మ, సోదరుడు సుధాకర్ రెడ్డి, కుటుంబ సభ్యులు పాదపూజ చేసి స్వామి ఆశీస్సులు పొందారు.

విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలి

- మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు



మెదక్ పట్టణ పోలీసు స్టేషన్‌లో ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

మెదక్ అర్బన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలని జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు సూచించారు. బుధవారం పట్టణ పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ ఆకస్మిక తనిఖీ చేశారు. పోలీసుల విధులు, రిజిస్టర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గంజాయి, గేమింగ్, పేకాట, బెట్టింగ్, గంబ్లింగ్ తదితర వాటిపై నిఘా పెట్టాలన్నారు. కేసుల నమోదు జాప్యం చేయొద్దన్నారు. సమాచార వ్యవస్థను పటిష్ఠం చేసుకొని, అసాంఘిక కార్యకలాపాలపై నిఘా పెట్టాలన్నారు. రానున్న ఎన్నికల్లో అప్రమత్తంగా విధులు నిర్వర్తించి, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టాలన్నారు. బీట్ సిస్టం, పెట్రోలింగ్, డయల్ 100పై పలు సూచనలు చేస్తూ.. నేరాల నియంత్రణకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ ప్రసన్న కుమార్, సీఐ మహేష్ పాల్గొన్నారు.

పార్క్‌లో చెట్లు నరికేశారు..



పట్టణంలోని హౌజింగ్‌బోర్డు పార్కులో చెట్లు నరికివేతకు గురైన దృశ్యం

జహీరాబాద్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీ పార్క్‌లో చెట్లను నరకడం వివాదాస్పదమైంది. మంగళ, బుధవారాల్లో పార్క్‌లోని పెద్ద పెద్ద చెట్లను నరికేశారు. ఈ విషయాన్ని స్థానికులు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు వచ్చి నరికేసిన చెట్లను పరిశీలించించి, ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. నిబంధల ప్రకారం పార్క్‌లో చెట్లను తొలగించాలంటే మున్సిపల్, అటవీ శాఖ అధికారుల అనుమతులు తప్పని సరి. అవేవీ లేకుండా విద్యుత్ తీగలకు తగుతున్నాయనే నెపంతో విద్యుత్ శాఖ పెద్ద పెద్ద చెట్లను నరికి వేసిందనిస్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ తీగలకు తగులుతున్నాయని విద్యుత్ అధికారులు కొమ్మలు తొలగించకుండా ఏకంగా చెట్లనే నరికి వేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై అటవీశాఖ అధికారులను సంప్రదించగా, అనుమతులు తీసుకోలేదని.. విద్యుత్ అధికారులకు నోటీసులు జారీ చేస్తామన్నారు. మున్సిపల్ కమిషనర్ సుభాష్‌రావును సంప్రదించగా, గుర్తు తెలియని వ్యక్తులు చెట్లను నరికి వేశారని వారిపై పోలీసులకు ఫిర్యాదు చేశామని చెప్పారు. విద్యుత్ ఏడీఏ మధుసూదన్‌ను అడగగా, విద్యుత్ తీగలకు తగిలితే చెట్ల కొమ్మలను, చెట్లను తొలగించమని చెప్పారు.

బతికుండగానే పౌతితో భూమి కాజేత

- పోలీస్‌స్టేషన్‌లో బాధితుడి ఫిర్యాదు



పౌతిలో పట్టేదారుకు కొడుకుగా చూపిన దృశ్యం

మద్దూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ అధికారుల అండదండలతో తప్పుడు మరణ ధ్రువీకరణ పత్రాన్ని సృష్టించి ధరణిలో వారసత్వం (పౌతి) పేరిట భూమి కాజేసిన సంఘటన దూళిమిట్ట మండలంలోని బెక్కల్ గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడు తుజలాపురం మొండయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మొండయ్య జీవనోపాధి కోసం హైదరాబాద్‌కు వలసవెళ్లి అమీన్‌పూర్‌లో ఇస్త్రీ షాపు నడుపుకుంటున్నాడు. ఇదే అదునుగా భావించిన తన పెద్దనాన్న కుమారుడు తుజలాపురం రాములు తాను చనిపోయినట్లు తప్పుడు ధ్రువపత్రాన్ని సృష్టించి తహసీల్దారుతో కుమ్మక్కై ఆగస్టు 14, 2024న తనకు చెందిన 1.0550 గుంటల భూమిని అతడి పేరున పట్టా చేయించుకున్నాడు. ఇటీవల భూ భారతిలో గ్రామంలోని కొందరు వివిధ భూ సమస్యలపై దరఖాస్తులు చేసుకుంటున్నట్లు తెలుసుకున్నానని మొండయ్య.. 1బీ పహాణీ తీసుకోగా భూమి తక్కువగా చూపించడంతో కంగుతిన్నాడు. ఈ విషయమై తహసిల్దారు కార్యాలయంలో సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసుకోగా అసంపూర్తి సమాచారాన్ని ఇచ్చారని తెలిపారు. చివరకు తన పెద్దనాన్న కుమారుడు తుజలాపురం రాములు వారసత్వం పేరిట తన భూమికి ఇతర గ్రామంలోని వ్యక్తులచే సాక్షి సంతకాలు పెట్టించి కాజేసినట్లు తెలిసిందన్నారు. అంతేకాకుండా మార్చి 11, 2025న ఈ భూమిని అతడి భార్య పేరున రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తెలిపారు. ఈ విషయమై బాధితుడు మద్దూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు తాను బతికే ఉన్నానని, తనకు న్యాయం చేయాలని కోరారు. అంతేకాకుండా తన భూమి కాజేసిన తుజలాపురం రాములుతో పాటు ఎలాంటి విచారణ చేయకుండా రిజిస్ట్రేషన్ చేసిన తహసీల్దారు శ్యామ్‌పై చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఈ విషయమై ప్రస్తుత తహసీల్దార్ మధుసూధన్ వివరణ కోరగా గత తహసీల్దారు చేసిన రిజిస్ట్రేషన్ సమయంలో కుటుంబ సభ్యుల అంగీకారంతో పాటు, డెత్ సర్టిఫికెట్ లేకుండా ఉందని, దీనిపై విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

న్యూస్ బాక్స్

నాగ్‌నాథ్‌కు భూపాల్‌రెడ్డి పరామర్శ

నారాయణఖేడ్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చల్లగిద్దతండాకు చెందిన నాగ్‌నాథ్ పాముకాటుకు గురై ఖేడ్ ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి బుధవార ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పరమేశ్వర్, మున్సిపల్ మాజీ చైర్మన్ రుబీనాబేగంనజీబ్, మాజీ కౌన్సిలర్ కవితవిఠల్, తదితరులు ఉన్నారు.

విదేశాల్లో విద్యాభ్యాసం కోసం దరఖాస్తు చేసుకోండి

సంగారెడ్డి క్రైం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని షెడ్యూల్డ్ కులాలకు చెందిన అభ్యర్థులు 2025-26 సంవత్సరానికిగానూ విదేశాల్లో విద్యాభ్యాసం చేసేందుకు ఆగస్టు 31వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధిశాఖ అధికారి అఖిలేష్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యా నిధి పతకం ద్వారా ఈ అవకాశం కల్పిస్తున్నట్టు చెప్పారు. జిల్లాలోని షెడ్యూల్డ్ కులాలకు చెందిన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా తెలంగాణ ఈపాస్ డాట్ సిజిజి డాట్ జీవోవి డాట్ ఇన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని ఆయన సూచించారు.

ఆ విద్యాసంస్థపై చర్యలు తీసుకోండి

సంగారెడ్డి అర్బన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పటాన్‌చెరులో గుర్తింపు లేకుండా నడుస్తున్న ఆ విద్యాసంస్థ పై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేశ్ కోరారు. ఈ విషయమై బుధవారం డీఐఈవో గోవిందరామ్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. మిక్స్‌డ్ ఆక్యుపెన్సీ పర్మిషన్ లేకుండా నిబంధనలకు విరుద్ధంగా డిగ్రీ, జూనియర్ కళాశాల రెండూ నడిపిస్తున్నారని ఆరోపించారు.

విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ

హత్నూర, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గుండ్లమాచూనూర్ గ్రామ శివారులో గల హానర్ ల్యాబ్ పరిశ్రమ యాజమాన్యం పరిసర గ్రామాల్లోని గుండ్ల మాచూనూర్, బొక్కలగూడెం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నోట్ బుక్స్, యూనిఫామ్, బ్యాగులు అందజేశారు. సుమారు 100 మంది విద్యార్థులకు పంపిణీ చేసినట్లు పరిశ్రమ హెచ్‌ఆర్ మేనేజర్ సుభాష్‌రెడ్డి తెలిపారు. ప్రధానోపాధ్యాయరాలు శాహెనాబేగం, గ్రామ కార్యదర్శి రమణారెడ్డితదితరులు పాల్గొన్నారు.

నిజమైన లబ్ధిదారులకే పరిహారం : తహసీల్దార్

సంగారెడ్డి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): గుమ్మడిదలలోని 109 సర్వే నంబర్లలో భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం చెల్లించే నష్ట పరిహారంలో ఎలాంటి చేతివాటం జరగలేదని, నిజమైన లబ్ధిదారులను క్షేత్రస్థాయిలో పరిశీలించి చెల్లిస్తామని తహసీల్దార్ పరమేశం తెలిపారు. అర్హులకు పరిహారం రాలేదని తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి : భూపాల్‌రెడ్డి

వెల్దుర్తి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ హయాంలోనే రాష్ట్రం అభివృద్ధి చెందిందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు భూపాల్ రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రమైన వెల్దుర్తిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పదేళ్లకాలంలో బీఆర్ఎస్‌తో నర్సాపూర్ నియోజకవర్గంలో ఎంతో అభివృద్ధి జరిగిందన్నారు. తప్పుడు హామీలతో కాంగ్రెస్ ప్రజలను మోసం చేస్తుందన్నారు. మెదక్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కృష్ణగౌడ్, మాజీ ఎంపీటీసీ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో గిరిజన విద్యార్థులకు ప్రవేశం

సంగారెడ్డి క్రైం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): బేగంపేటలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో 1వ తరగతి ఇంగ్లిష్ మీడియంలో ఆరుగురికి (బాలురు ముగ్గురు, బాలికలు ముగ్గురు) విద్యార్థుల ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు గిరిజన అభివృద్ధి అధికారి వి.నీలిమ ఒక ప్రటకలో తెలిపారు. విద్యార్థులు 2018 జూన్ 1 నుంచి 2019 మే 31వ తేదీలోపు జన్మించిన వారై ఉండాలని, ఆసక్తి గల అభ్యర్థులు పూర్తి వివరాలతో దరఖాస్తు ఫారాలు నింపి తహసీల్దార్‌తో ధ్రువీకరించిన కులం, ఆదాయ సర్టిఫికెట్, పుట్టినతేదీ ధ్రువపత్రాలతో జిల్లా గిరిజన అభివృద్ధి కార్యాలయంలో సమర్పించుకోవాలన్నారు. దరఖాస్తులు వచ్చేనెల 8వ తేదీలోగా సమర్పించాలన్నారు. ఆగస్టు 13న లాటరీ పద్ధతి ద్వారా విద్యార్థుల ఎంపిక జరుగుతుందని తెలిపారు.

ఐలాపూర్‌లో వనమహోత్సవం

అమీన్‌పూర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): వందరోజుల కార్యాచరణలో భాగంగా అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఐలాపూర్‌లో బుధవారం వనమహోత్సవాన్ని నిర్వహించారు. మున్సిపల్ సిబ్బందితో కలిసి గ్రామ యూత్ ఫర్ సేవా సంఘం యువత పాల్గొని పెద్ద సంఖ్యలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి మాట్లాడారు.

ఆలయాల అభివృద్ధికి సహకరిస్తా : ఎమ్మెల్యే



అయ్యప్పస్వామి ఆలయ పూజల్లో ఎమ్మెల్యే సునీతారెడ్డి

హత్నూర, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఆలయాల అభివృద్ధికి సహకరిస్తానని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా రెడ్డి పేర్కొన్నారు. హత్నూర మండలం దౌల్తాబాద్ కాసాల గ్రామ శివారులోని రాయగడ చింతల్ వీర హనుమాన్ ఆలయం ప్రాంగణంలో అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణ పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే, రాష్ట్ర కార్మిక సంక్షేమ బోర్డు మాజీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి, తనవంతు సహకరిస్తామని ఆలయ నిర్వాహకులకు తెలిపారు. అలాగే మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ తిరుమల సుహాసినిరెడ్డి, కాంగ్రెస్ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, కాంగ్రెస్ మెదక్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ కూడా పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల మండల నాయకులు వివిధ గ్రామాల అయ్యప్ప భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

శేషజీవితం ఆనందంగా గడపాలి

వెల్దుర్తి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): 38 సంవత్సరాల పాటు విద్యాశాఖలో సేవలందించి ఉద్యోగ విరమణ పొందిన ఎంఈవో యాదగిరి శేషజీవితం కుటుంబసభ్యులతో ఆనందంగా గడపాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. బుధవారం వెల్దుర్తి ఎంఈవోగా పనిచేసిన యాదగిరి పదవీ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన ఆత్మీయ అభినందన సభలో పాల్గొని ఎమ్మెల్యే మాట్లాడారు. అనంతరం ఎంఈవో యాదగిరి దంపతులను పూలమాల, శాలువాలతో ఘనంగా సన్మానించారు. అలాగే జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసిని రెడ్డి, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి కూడా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, జిల్లా సెక్టోరియల్ అధికారి జ్యోతి, ఆయా శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

సాకి చెరువు కట్టపైకి మహనీయుల విగ్రహాలు

● పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



చెరువు కట్టపై స్థలాలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా అడ్డుగా ఉన్న మహనీయుల విగ్రహాలు సాకి చెరువు కట్టపైకి మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి చెప్పారు. బుధవారం నేషనల్ హైవే అథారిటీ అధికారులు రామకృష్ణతో కలిసి విగ్రహాలున్న ప్రాంతాలను పరిశీలించి, మాట్లాడారు. పటాన్‌చెరులో రోడ్లకు ఇరువైపులా ఉన్న మహాత్మా బసవేశ్వరుడు, ప్రజా గాయకుడు గద్దర్, స్వామివివేకానంద, కొండా లక్ష్మణ్ బాపూజీ, తెలంగాణ అమరవీరుల స్థూపం, చాకలి ఐలమ్మ, రాణాప్రతాప్, సర్వాయిపాపన్న, ఛత్రపతి శివాజీ విగ్రహాలను సాకి చెరువు కట్టపైకి మారుస్తున్నామని తెలిపారు. రామచంద్రాపురంలో మహాత్మాగాంధీ విగ్రహాన్ని జిల్లా పరిషత్ పాఠశాలలోకి, బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఇక్రిశాట్ పక్కన, చాచా నెహ్రూ విగ్రహాన్ని ఐబీ సమీపంలోకి మారుస్తున్నామని తెలిపారు.

సంగారెడ్డిలో 15 రోడ్లు మంజూరు : ఎమ్మెల్యే

సంగారెడ్డి టౌన్/సంగారెడ్డి క్రైం, జూలై 30 ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులతో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ బుధవారం తన క్యాంపు కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. (హెచ్ఏఎం) హైబ్రిడ్ అన్యూనిటీ మోడ్ విధానం ద్వారా మంజూరైన రోడ్ల వివరాలను అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ద్వారా సంగారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గంలోని 15 రోడ్లకు 50.08 కిలో మీటర్ల మేర మొదటి దశలో మంజూరయ్యాయన్నారు. గతంలో ఎస్‌డీఎఫ్, ఎంఆర్ఆర్ కింద మంజూరై మిగిలిపోయిన పనులను హమ్ విధానం కింద చేపట్టాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. సంగారెడ్డి నియోజకవర్గంలోని కొండాపూర్, సంగారెడ్డి, కంది మండలాలకు చెందిన 73 మందికి రూ.23.90 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను చింతా ప్రభాకర్ తన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు చింతాకు కృతజ్ఞతలు తెలిపారు.

పీఎంశ్రీ పథకంతో పాఠశాలల అభివృద్ధి



ప్రధాని మోదీ, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ఎంపీ రఘునందన్‌రావు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నేతలు

మెదక్ అర్బన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పీఎంశ్రీ (ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి చెందుతున్నాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేశంగౌడ్ తెలిపారు. పీఎంశ్రీ కింద కూచన్‌పల్లి జెడ్పీహెచ్ఎస్‌కు రూ.22 లక్షల నిధుల మంజూరు పట్ల బుధవారం హవేళీఘణపూర్‌లో మండలశాఖ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్, ఎంపీ రఘునందన్‌రావు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పీఎంశ్రీ కింద ఎంపికైన ప్రభుత్వ బడుల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం అవసరమైన నిధులను కేంద్ర ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఆ నిధులతో విద్యార్థులకు అవసరమైన సాంకేతిక సాధనాలు, డిజిటల్ విధానంలో బోధన తదితర సౌకర్యాలు కల్పించుకోవచ్చన్నారు. నిధులు మంజూరు చేసిన పీఎం, కేంద్ర మంత్రి, ఎంపీలకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శులు ఎంఎల్ఎన్‌రెడ్డి, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు కాశీనాథ్, మండల, పట్టణ అధ్యక్షులు రంజిత్‌రెడ్డి, ప్రసాద్ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

● యూఎస్‌పీసీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర నాయకుడు లక్ష్మయ్య



మల్కాపూర్ పాఠశాలలో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి నాయకులు

కొండాపూర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలను పరిష్కరించి విద్యార్థుల తల్లిదండ్రులకు నమ్మకం కలిగేలా చర్యలు తీసుకోవాలని యూఎస్‌పీసీ ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి సభ్యులు బుధవారం తొగర్‌పల్లి పాఠశాల అవరణలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మయ్య మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మూడు దశల పోరాటంలో భాగంగా తహసీల్దార్లకు అందించిన వినతిపత్రాలతో సీఎం స్పందించి పదోన్నతులపై సంతకం చేయడం మొదటి దశ పోరాటం విజయవంతమైందన్నారు. ఆగస్టు 5న కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించే భారీ ధర్నాను కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ నిరసనలో ఉపాధ్యాయ సంఘం నాయకులు చంద్రమోహన్ జగన్నాథం, సాయిలు, పుండరికం, ప్రకాష్ పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి

రామచంద్రాపురం టౌన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో ప్రతి ఒక్కరు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్సీ అంజిరెడ్డి అన్నారు. బుధవారం రామచంద్రాపురం సాయినగర్ కాలనీలో నులిపురుగుల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది బస్తీల్లో ఇంటింటికి వెళ్లి మందులు పంపిణీ చేయనున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి తదితరులు పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్‌కు సన్మానాల వెల్లువ



ఖేడ్‌లో సబ్ కలెక్టర్ ఉమాహారతిని సన్మానిస్తున్న వివిధ సంఘాల బాధ్యులు

నారాయణఖేడ్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఖేడ్ సబ్ కలెక్టర్‌గా ఉమాహారతి నియామకమైన సందర్భంగా ఆమెకు సన్మానాలు వెల్లువెత్తాయి. బుధవారం ఖేడ్‌లోని కార్యాలయంలో వివిధ సంఘాల బాధ్యులు, నాయకులు, అధికారులు ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానించి పుష్పగుచ్ఛాలు, జ్ఞాపికలను అందజేసి అభినందనలు తెలిపారు. ఖేడ్ డివిజన్ ప్రజల సంక్షేమం, సమస్యల పరిష్కారం, అభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు. సన్మానాలు చేసిన వారిలో గొర్రెలు, మేకల పెంపకందారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాపుమల్‌శెట్టి, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అంజాగౌడ్, నాయీబ్రాహ్మణ సంఘం జిల్లా సమన్వయకర్త నరేందర్, గోవింద్‌నాయక్, గృహ నిర్మాణశాఖ స్థానిక అధికారులు, తదితరులు ఉన్నారు.

ఈత వనాలతో గీత కార్మికులకు ఉపాధి

● జోగిపేట ఎక్సైజ్ సీఐ సాగర్‌రెడ్డి

పుల్‌కల్, జూలై 30 ఆంధ్రజ్యోతి): ఈత వనాల పెంపుతో గీత కార్మికులకు ఉపాధి లభిస్తుందని జోగిపేట ఎక్సైజ్ సీఐ సాగర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రమైన చౌటకూర్‌లో స్థానిక గీత పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో బుధవారం 75వ వన మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై ఈత మొక్కలు నాటారు. గీత కార్మికులు తమ పట్టా భూముల్లో కూడా ఈత వనాలను పెంచుకోవచ్చన్నారు. ప్రతీ గ్రామంలో సొసైటీలు, టీఎఫ్‌టీ లైసెన్సులు పొందిన గీత కార్మికులు విరివిగా ఈత వనాలను పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ విజయ్‌కుమార్, సందీప్, గీత పారిశ్రామిక సాహకార సంఘం అధ్యక్షుడు సుధాకర్‌గౌడ్, హరిశంకర్‌గౌడ్, నరేందర్ గౌడ్, రాధాగౌడ్, రమేశ్‌గౌడ్, అనిల్‌కుమార్‌గౌడ్, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

రాయికోడ్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరవుతాయని సంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య అన్నారు. బుధవారం రాయికోడ్ మండల పరిధిలోని యూసుఫ్‌పూర్ గ్రామంలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్లకు భూమి చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సహకారంతో మండలంలో అనేక అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బాలాజీనర్సింలు, ఉమ్మడి మెదక్ జిల్లా మాజీ డీసీఎంఎస్ చైర్మన్ సిద్ధన్నపాటిల్, కాంగ్రెస్ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకునేందుకే పర్యటన

నర్సాపూర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో సమస్యలు తెలుసుకుని వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకే నర్సాపూర్ పట్టణంలో వార్డులవారీగా పర్యటిస్తున్నట్లు కాంగ్రెస్ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం నర్సాపూర్ పట్టణంలో రెండోరోజు నమస్తే నర్సాపూర్ పేరిట చేపట్టిన వార్డుల పర్యటన 1,2,3 వార్డులలో పర్యటించారు. మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌గుప్తా, పార్టీ మండల అధ్యక్షుడు మల్లేశం, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ హబీబ్‌ఖాన్ పాల్గొన్నారు. 3వ వార్డులో డ్రైనేజీ, పారిశుధ్య సమస్యలు పరిష్కరించాలని వార్డు ప్రజలు ఫిర్యాదు చేశారు. కమిషనర్ శ్రీరాంచరణ్‌రెడ్డి వార్డులో పర్యటించారు.

జిల్లావ్యాప్తంగా యూరియా కొరత లేదు

చేగుంట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లావ్యాప్తంగా యూరియా కొరత లేదని, రైతులు ఆందోళన చెందొద్దని జిల్లా వ్యవసాయ అధికారి దేవ్‌కుమార్ పేర్కొన్నారు. చేగుంట మండలంలోని ఎరువుల దుకాణాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. మెదక్ జిల్లాలో 3,343 ఎంటీ(మెట్రిక్ టన్స్) యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. ఎవరైనా డీలర్లు ఎరువులను అధిక ధరలకు విక్రయించినా.. వేరే ప్రొడక్ట్స్ బలవంతంగా రైతులకు అంటగట్టినా స్థానిక మండల వ్యవసాయ అధికారి దృష్టికి తీసుకురావాలని రైతులకు సూచించారు.

డీడీ కార్యాలయం తరలింపు అవాస్తవం

మెదక్ అర్బన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మెదక్ విజయ డెయిరీ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయం తరలింపు అవాస్తవమని, బీఆర్ఎస్ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మాజీ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్ మండిపడ్డారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి చూసి ఓర్వలేక, ప్రజల దృష్టి మళ్లించేందుకు బీఆర్ఎస్ నేతలు అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. గత బీఆర్ఎస్ హయాంలో మెదక్ నుంచి ఎన్ని కార్యాయాలు సిద్దిపేట, సంగారెడ్డికి ఎలా తరలిపోయాయో బీఆర్ఎస్ నాయకులు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. తరలిపోయిన కార్యాలయాలను ఎమ్మెల్యే మెదక్‌కు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. సమావేశంలో మాజీ ఏఎంసీ చైర్మన్ మధుసూదన్‌రావు, మాజీ కౌన్సిలర్లు లింగం, లక్ష్మీనారాయణగౌడ్, సమీ, శేఖర్, ముత్యంగౌడ్, కాంగ్రెస్ నేతలు పవన్, దుర్గాప్రసాద్, వసంత్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, కాంగ్రెస్ నేతలు

ఖాకీల బది'లీలలు'..!

(5వ పేజీ తరువాయి)

ఉన్నాయనే చర్చ కూడా జరుగుతోంది. ఇక రామచంద్రాపురం, కొల్లూరు సీఐలు పూర్తిగా సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఉండటం వల్ల వారిని కదిలించే సాహసం చేయలేకపోతున్నారు. నియోజకవర్గ పరిధిలో రియల్ ఎస్టేట్ వ్యాపారం మూడు పువ్వులు.. ఆరు కాయలుగా వర్ధిల్లుతున్నదనే విషయం తెలిసిందే. ఇక్కడి అధికారులు కొందరు రియల్ వ్యాపారులతో కలిసి పని చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గతంలో ఎప్పుడో కొనుగోలు చేసిన భూముల విషయంలోనూ ఖాకీలు కలుగజేసుకుని, బెదిరింపులకు పాల్పడుతున్నారని తెలుస్తోంది.

ప్రమోషన్ లిస్టులో 152 మంది టీచర్లు

(5వ పేజీ తరువాయి)

సుమారు 10-15 మందికి, జీహెచ్ఎం గ్రేడ్-2 ప్రమోషన్లు రావచ్చునని భావిస్తున్నారు. అదే విధంగా పీఎస్‌హెచ్ఎం, స్కూల్ అసిస్టెంట్ల పోస్టులతో కలిపి మొత్తం 152 మందికి పదోన్నతులు లభించే అవకాశం ఉంది. ఇక జీహెచ్ఎం పోస్టులు మొత్తం 136 ఉండగా, పనిచేస్తున్నది 111మంది ఉపాధ్యాయులు. 25 పోస్టులు ఖాళీగా ఉన్నాయని విద్యాశాఖ వర్గాలు వెల్లడించాయి.

పేదల అభ్యున్నతికి బీజేపీ కృషి

● పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరిఅంజిరెడ్డి



బీజేపీలో చేరుతున్న వివిధ పార్టీల కార్యకర్తలు

పటాన్‌చెరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): నిరుపేదల అభ్యున్నతికి ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం పనిచేస్తోందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరిఅంజిరెడ్డి అన్నారు. బుధవారం ఐడీఏబొల్లారం పారిశ్రామికవాడలో పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు ఆనందకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఇతర పార్టీల నాయకులు బీజేపీలో చేరగా.. వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు రవీందర్‌రెడ్డి, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మేఘనారెడ్డి, అఖిల్, శ్రీకాంత్, అరుణ్, మోహిత్రాజ్‌పుష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మురుగు లీకేజీల నివారణ : కార్పొరేటర్

రామచంద్రాపురం టౌన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): బస్తీల్లో మురుగు లీకేజీలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ పుష్పానగేష్ అన్నారు. బుధవారం రామచంద్రాపురం డివిజన్ పరిధి శ్రీనివాస్‌నగర్‌లో మురుగు పైపులైన్ పనులను పరిశీలించి మాట్లాడారు. వేస్తున్న పైపులకు ప్రతి ఇంటి మురుగు పైపులను ప్రధాన లైన్‌కు అనుసంధానం చేస్తామని చెప్పారు. పైపులైన్ నిర్మాణం పూర్తయిన తరువాత రోడ్డు వేయిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహేందర్‌రెడ్డి, సత్యనారాయణ, అశోక్,సురేందర్‌కుమార్, యాదయ్య, అరుణ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పెన్నార్ యాజమాన్యం మొండివైఖరి

పటాన్‌చెరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కార్మికులపై వేధింపులు ఆపకపోతే పెద్దఎత్తున ఆందోళన చేపడతామని సీఐటీయూ జిల్లా కోశాధికారి రాజయ్య అన్నారు. బుధవారం పటాన్‌చెరు జరిగిన సమావేశంలో మాట్లాడారు. పటాన్‌చెరు డివిజన్ పరిధి బండ్లగూడ గ్రామంలోని పెన్నార్ పరిశ్రమ యాజమాన్యం పనిచేస్తున్న కార్మికుల పట్ల మొండివైఖరి అవలంబిస్తోందని తెలిపారు. వేతన ఒప్పందాలపై నేరుగా మాట్లాడుతున్న వారిపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని చెప్పారు. వైఖరి మార్చుకోకపోతే కార్మికశాఖకు ఫిర్యాదు చేసి కంపెనీ ఎదుట ధర్నా చేస్తామని తెలిపారు.

ఆ టీచర్లను తొలగించొద్దు : గ్రామస్థులు

నిజాంపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఆ టీచర్లను తొలగించొద్దని, తక్షణమే డిప్యూటేషన్ రద్దు చేయాలని గ్రామస్థులు అదనపు కలెక్టర్ నగేష్‌కు మొరపెట్టుకున్నారు. మండల పరిధిలోని నందగోకుల్ గ్రామ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులను ఇటీవల డిప్యూటేషన్‌పై వేరే చోటుకు బదిలీ చేయడంపై బుధవారం మెదక్ అదనపు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాలలకు తమ పిల్లలను పంపకుండా ప్రభుత్వ పాఠశాలలకు పంపిస్తే.. చక్కగా బోధించే పంతుళ్లను వేరేచోటుకు మార్చడం సరికాదన్నారు. వెంటనే వారి డిప్యూటేషన్‌ను రద్దు చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో గ్రామస్థులు ప్రవీణ్, జీవన్‌రెడ్డి, రాజిరెడ్డి, స్వామి ఉన్నారు.

ఎండీఆర్ ఫౌండేషన్‌కు గేమ్‌ఛేంజర్ అవార్డు



అవార్డు అందుకుంటున్న మధుసూదన్

పటాన్‌చెరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని మృతదేహాలు దహనం చేయడం, ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం, నిరుపేద విద్యార్థులకు ఆర్థిక సహకారం అందించడం, పర్యావరణ పరిరక్షణ చేపట్టడం, ఆర్థికంగా వెనకబాటు తనానికి గురైన కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందించడం వంటి కార్యక్రమాలు చేసినందుకు ఎండీఆర్ ఫౌండేషన్‌కు గేమ్‌ఛేంజర్ అవార్డు లభించింది. విశ్వగురువు వరల్డ్ రికార్డ్స్ అనే సంస్థ బుధవారం బాచుపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు మధుసూదన్‌కు అవార్డు అందజేశారు. ఫౌండేషన్ చైర్మన్ దేవేందర్‌రాజు, పృథ్వీరాజ్ ఆర్థికంగా ఎప్పటికప్పుడు సహకారం అందించడం వల్లే నిరుపేదలకు ఆసరా కల్పించగలిగామన్నారు.

పనులు పరిశీలించిన ఈపీటీఆర్ఐ బృందం

రామాయంపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రెండేళ్లలో అటవీ ప్రాంతాల్లో చేపట్టిన వివిధ పనులను బుధవారం తనిఖీ బృందం పర్యవేక్షించింది. ఈ మేరకు ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ టెక్నికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(ఈపీటీఆర్ఐ) నుంచి వచ్చిన బృందం రామాయంపేట మండల పరిధి అక్కన్నపేట ప్రాంతంలో పరిశీలించారు. ప్లాంటేషన్, చిన్న చిన్న కుంటలు నిర్మించిన పనుల తీరును చూశారు. సుమారు రెండు గంటల పాటు కాలిబాటన పర్యటించి మొక్కల పెంపకం సైజును కొలిచారు. బృందం వెంట ఫారెస్ట్ డిప్యూటీ రేంజర్ శ్రీనివాస్, బీట్ ఆఫీసర్ లక్ష్మణ్, సిబ్బంది ఉన్నారు.

ఎన్‌హెచ్‌ఆర్ఎస్‌జేసీ మండల కన్వీనర్‌గా ప్రవీణ కుమారి

రాయికోడ్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ కమిషన్ మండల కన్వీనర్‌గా మండలంలోని రామోజిపల్లి గ్రామానికి చెందిన మన్నూరి ప్రవీణ కుమారిని నియమించారు. నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ కమిషన్ జాతీయ చైర్మన్ మహతాబ్‌రాయ్, రాష్ట్ర అధ్యక్షుడు, ఇండియా ఇన్‌చార్జి సర్వేందర్, రాష్ట్ర చైర్మన్ అబ్దుల్ రహీం, వైస్ చైర్మన్ వై.పండరి ఆదేశాల మేరకు బుధవారం జిల్లా అధ్యక్షుడు క్రిష్ణ ఆధ్వర్యంలో నారాయణఖేడ్‌లోని ప్రాంతీయ కార్యాలయంలో సమావేశం నిర్వహించి నూతన కమిటీలను నియమించారు.